# వ్యవసాయ బడ్జెట్ 2012-13 ప్రతిపాదనలు

## రైతు స్వరాజ్య వేదిక[1]

ఫిబ్రవరి 6, 2012

భారత దేశానికి అన్నపూర్ణ గా పేరు గాంచిన ఆంధ్ర ప్రదేశ్ గత మూడు దశాబ్దాలుగా రైతుల ఆత్మ హత్యలతో అట్టుడికి పోతున్నది. క్రైం బ్యూరో రికార్డుల ప్రకారం 2010 లో రాష్ట్ర వ్యాప్తం గా 2525 ఆత్మహత్యలు జరిగి నట్టుగా తెలుస్తోంది. 2011 లో కేవలం అక్టోబర్-నవంబర్ నెలలలో 156 ఆత్మహత్యలు అరిగాయని వార్తలు తెలియ చేస్తున్నాయి. వ్యవసాయ రంగంలో నెలగొని వున్న సంక్షోభానికి రైతుల ఆత్మహత్యలు ఒక చిన్న ప్రతీక మాత్రమే. పెట్టుబడులు పెరిగి పోయి ధరలు గిట్టుబాటు కాని పరిస్థితి లో దాదాపు 85 వేల ఎకరాలలో రైతులు ఈ సంవత్సరం 'పంట విరామం' ప్రకటించారు. విస్తరణ వ్యవస్థ పూర్తి గా కుప్పకూలటం తో పంటలగురించి గాని, పండించే పద్ధతుల గురించి గాని సరైన సహకారం అందక రైతులు తీవ్రం గా నష్ట పోయారు. కేవలం నాలు పంటలు వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ సుమారు 80 శాతం విస్తీర్ణం లో సాగు చేసారు. అనువుగాని ప్రాంతాలలో పండించటం వలన చాలా పంట నష్టం జరిగింది. దీనికి తోడు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని వుండటం తో సుమారు 85 వేల ఎకరాలలో పంట నష్టం వాటిల్లింది.

సుమారు రాష్ట్ర జనాభాలో 69 శాతం ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, రాష్ట్ర, దేశ ప్రజలకు ఆహారం, అనేక పరిశ్రమలకు ముడి సరుకులు అందించి అటు ఆహార భద్రతకు, ఇటు ఆదాయానికి తోడ్పడే 'వ్యవసాయ అనుబంధ రంగాల'కి కేవలం 2.6 శాతం మాత్రమే కేటాయించటం తో వ్యవసాయాభివృద్ధి పూర్తి గా కుంటుపడింది. కేటాయించిన కొద్దిపాటి బడ్జెట్ కూడా ఉద్యోగస్తుల జీత భత్యాలకు, కంపెని లకు అందించే సబ్సిడీలకు సరిపోయాయి. ఇందుకు వ్యవసాయ రంగాన్ని ప్రాధాన్య రంగం గా గుర్తించి

- వ్యవసాయానికి ప్రత్యేక ఆర్థిక సర్వే మరియు బడ్జెట్ ప్రవేశ పెట్టాలి. ఇప్పటికే కర్ణాటక, మధ్య ప్రదేశ్ రాష్ట్రాలు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ లు ప్రవేశపెట్టాయి.
- వ్యవసాయ అనుబంధ రంగాలకు (సాగునీటి రంగం కాకుండా) బడ్జెట్ లో కనీసం 20 శాతం కేటాయించాలి.
- వ్యవసాయం మరియు అనుబంధ రంగాల మంత్రిత్వ శాఖలు, డిపార్టుమెంటు లతో ఒక ప్రత్యేక కాబినెట్ ఏర్పరచాలి. ఈ కాబినెట్ ప్రతి నెలా సమావేశమై వ్యవసాయ రంగ పరిస్థితుల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి. వీటిలో రైతుసంఘాలకి, వ్యవసాయ సహకార సంఘాలకి, వ్యవసాయరంగంలో పని చేస్తున్న స్వచ్చంద సంస్థలకి కూడా సభ్యత్వం కల్పించాలి. ఇప్పటికే మధ్యప్రదేశ్ రాష్ట్రం లో ఈ ఏర్పాటు వుంది.
- వ్యవసాయ పరిశోధన, విస్తరణ ల పై దృష్టి సారించి వీటిని రైతులకు జవాబుదారిగా వుండేలా విధానాలు రూపొందించాలి

---

[1] రైతు స్వరాజ్య వేదిక, సుస్థిర వ్యవసాయ కేంద్రం, 12-13-445, వీధి నెం 1, తార్నాక, సికింద్రాబాదు-500017

ph 040-27017335,

రామాంజనేయులు 09000699702 ramoo@csa-india.org, కిరణ్ విస్సా 09701705743 kiranvissa@gmail.com

# <u>రైతు స్వరాజ్య వేదిక బడ్జెట్ ప్రతిపాదనలు</u>

| | **బడ్జెట్ అంశం** | **కేటాయింపు (రూ. కోట్లలో)** |
|---|---|---|
| 1 | పంట సేకరణ, మద్దతు ధరపై బోనస్, ధర పరిహారం | 8000 |
| 2 | ధరల స్థిరీకరణ నిధి | 1000 |
| 3 | వరి పంటకు గిడ్డంగులు (స్టేట్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్) | 140 |
| 4 | మార్కెట్ యార్డు సదుపాయాలూ, కోల్డ్ స్టోరేజ్, వగైరా | 500 |
| 5 | సుస్థిర సేద్యం, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సాహకాలు | 500 |
| 6 | వర్షాధార ప్రాంతాలకు ప్రత్యేక నిధి | 500 |
| 7 | 1000 ఉత్పత్తిదారుల సంఘాలు (ఒక్కొక్కటి 2500 ఎకరాల పరిధిలో) | 860 |
| 8 | తగిన స్థాయిలో యాంత్రీకరణకు మద్దతు | 500 |
| 9 | వ్యవసాయ విస్తరణ సిబ్బంది పెంపు (2500 ఎకరాలకి ఒక A.E.O.) ప్రస్తుతం వున్న వారికీ అదనంగా) | 200 |
| 10 | విత్తన వ్యవస్థను పెంపొందించడం | 500 |
| 11 | పరిశోధన వ్యవస్థను బలపరచడం | 500 |
| 12 | విపత్తు సహాయక నిధి | 2000 |
| 13 | కౌలుదారుల రుణాలకు పూచీకత్తు నిధి | 1000 |
| 14 | పంటల భీమా పథకం విస్తరణ, ప్రీమియం చెల్లింపు | 500 |
| 15 | వ్యవసాయదారుల సంక్షేమ నిధి | 100 |
| | **మొత్తము** | **16,800** |

## ప్రధానమైన డిమాండ్లు

### 1. పంట ధరలు, సేకరణ, మార్కెటింగ్

రాష్ట్రంలోను, దేశంలోనూ వ్యవసాయదారులందరినీ పీడిస్తున్న సమస్య ఉత్పత్తి ఖర్చులు పెరిగి పోవడమూ, వాటికీ పంటకు లభించే ధరలకీ పొంతన లేకపోవడమూ. వ్యవసాయం లాభదాయకంగా ఉండాలంటే స్వామినాథన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి ఖర్చుపై 50 శాతం లాభంతో కనీస మద్దతు ధరలు ప్రకటించాలని మనమందరమూ కేంద్రప్రభుత్వంతో డిమాండ్ చేస్తూ వచ్చాము కాని అది జరగలేదు. అయితే దీనిలో రాష్ట్రప్రభుత్వం కూడా తన వంతు బాధ్యత తీసుకోవలసిన అవసరం ఉంది. వరి మద్దతు ధర రూ.2070 ఉండలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కేంద్ర ధరల కమిషనుకు సిఫార్సు చేస్తే కేంద్రం రూ.1080 మాత్రమే నిర్ణయించింది. ఆ లోటును రైతులు ఎందుకు భరిస్తున్నారు. రైతులకు వచ్చిన ఈ నష్టానికి కొంతవరకైనా రాష్ట్రప్రభుత్వం బాధ్యత తీసుకున్నపుడే రైతులకు కొంతవరకు న్యాయం జరుగుతుంది.

క్రింది టేబుల్ లో కనీస మద్దతు ధర ప్రకటించే ముఖ్యమైన పంటలకు మన రాష్ట్రానికి సంబంధించిన ఉత్పత్తి వ్యయం (కేంద్ర ధరల కమిషన్ మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనాలు), స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధర ఇస్తే అయ్యే అదనపు వ్యయం, 10 శాతం లాభం వచ్చే విధంగా మద్దతు ధర ఇస్తే అయ్యే అదనపు వ్యయం, లెక్కలు ఇస్తున్నాము. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన ధర లభించడం రైతుల హక్కుగా భావిస్తే, గత సంవత్సరం మాత్రమే మన రాష్ట్ర రైతులు రూ.18,882 కోట్లు నష్ట పోయినట్లు లెక్క!

| పంట | ఉత్పత్తి (లక్ష టన్నుల) | మార్కెట్లో సరుకు (లక్ష టన్నులు) | ఉత్పత్తి వ్యయం అంచనా (ఒక క్వింటాలుకు రూ\|\|) | | ప్రకటిత కనీస మద్దతు ధర | C2*+50% లెక్కన కనీస మద్దతు ధర | C2*+10% లెక్కన కనీస మద్దతు ధర | C2+50% లెక్కన అదనపు వ్యయం (కోట్లలో) | C2+10% లెక్కన అదనపు వ్యయం (కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | CACP వారి ఆం.ప్ర. అంచనా | ఆం.ప్ర. రాష్ట్ర ప్రభుత్వ అంచనా | | | | | |
| వరి | 225.00 | 157.50 | 896.00 | 1270.00 | 1080.00 | 1905.00 | 1397.00 | 12993.75 | 4992.75 |
| జొన్న | 3.06 | 2.14 | 1393.00 | 1145.00 | 980.00 | 1717.50 | 1259.50 | 157.97 | 59.87 |
| సజ్జ | 0.94 | 0.66 | | 1258.00 | 980.00 | 1887.00 | 1383.80 | 59.68 | 26.57 |
| మొక్కజొన్న | 34.87 | 24.41 | 935.00 | 1114.00 | 980.00 | 1671.00 | 1225.40 | 1686.66 | 599.00 |
| రాగి | 0.51 | 0.36 | | 1177.00 | 1050.00 | 1765.50 | 1294.70 | 25.54 | 8.74 |
| కంది | 3.25 | 2.28 | 2373.00 | 3668.00 | 3100.00 | 5502.00 | 4034.80 | 546.46 | 212.67 |
| పెసర | 1.62 | 1.13 | 2974.00 | 3480.00 | 3400.00 | 5220.00 | 3828.00 | 206.39 | 48.54 |

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| మినుము | 3.01 | 2.11 | 1919.00 | 3495.00 | 3300.00 | 5242.50 | 3844.50 | 409.28 | 114.73 |
| వేరుశనగ | 14.23 | 9.96 | 3185.00 | 3324.00 | 2700.00 | 4986.00 | 3656.40 | 2277.08 | 952.67 |
| సోయా | 2.13 | 1.49 | | 1918.00 | 1650.00 | 2877.00 | 2109.80 | 182.95 | 68.56 |
| ప్రొద్దు తిరుగుడు | 2.04 | 1.43 | 2799.00 | 3439.00 | 2800.00 | 5158.50 | 3782.90 | 336.79 | 140.36 |
| **మొత్తము** | | | | | | | | **18882.56** | **7224.43** |

* C2 అంటే ఉత్పత్తి వ్యయం అంచనా వేసేందుకు ఒక ప్రమాణం.

డిమాండ్లు:

a. **2012-13లో మొదటి ఏడాదిగా కనీసం 10 శాతం లాభం వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వడానికి రూ.8000 కోట్లు కేటాయించాలి.** ఈ బోనస్ కనీసమద్దతు ధర ప్రకటించే ప్రతి ఆహార పంటకు ఉండాలి. ఇది దేశ ఆహార భద్రతకు అన్నింటి కంటే ముఖ్యమైన చర్య. ఈ బాధ్యత రాష్ట్రప్రభుత్వం చేపట్టినప్పుడే ధరల విషయంలో ప్రభుత్వానికి జవాబుదారితనం ఏర్పడుతుంది, కేంద్ర ప్రభుత్వంపై మద్దతు ధరల విషయంలో మరింత వత్తిడి తీసుకువచ్చేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

b. కేవలం వరి పంటకు మాత్రమే సేకరణ జరగడంతో తక్కిన పంటలకు మద్దతు ధరలు నామమాత్రంగానే ఉండిపోయాయి. మెట్టప్రాంతపు పంటలైన పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలను కూడా కొనుగోలు చేసి ప్రజాపంపిణి వ్యవస్థద్వారా సరఫరా చెయ్యాలి. సేకరణ చెయ్యలేని పంటలకు పైన లెక్కవేసిన బోనస్ ను "ధర పరిహారం" (Price Compensation) రూపంలో రైతులకు నేరుగా చెల్లించే పథకం మొదలుపెట్టాలి.

c. మార్కెట్లో ధరలు పడిపోయినప్పుడు రైతులు దుస్థితిలో పడకుండా ధరల స్థిరీకరణ నిధి ఉండాలి. దీనికి ఈ సంవత్సరంలో కనీసం రూ.1000 కోట్లు కేటాయించాలి.

d. మన రాష్ట్రంలో పంట కొనుగోలు సేకరణ వ్యవస్థలను సమూలంగా సంస్కరించాలి. మిల్లర్ల వద్ద నుండి కాకుండా ఇతర రాష్ట్రాలలో వలె రాష్ట్రప్రభుత్వం నేరుగా రైతుల వద్దనుండి వరి పంటను కొనుగోలు చెయ్యాలి. అంతేకాక, తమిళనాడు వలె మన రాష్ట్రంలోని చౌక డిపోల ద్వారా సరఫరా అయ్యే ఆహారధాన్యాలను రాష్ట్రప్రభుత్వమే కొనుగోలు చేసి సరఫరా చేసే బాధ్యత తీసుకుని కేంద్రప్రభుత్వం ఒక కే.జి. బియ్యంపై ఇచ్చే రూ.14.35 సబ్సిడీని వినియోగించుకుని రైతులకు కొంత ఎక్కువ ధర ఇవ్వతానికి అవకాశం ఉన్నది.

e. గత సంవత్సరం ధాన్యం సేకరణలో జరిగిన జాప్యం, గిడ్డంగుల సమస్య వలన రైతులు విపరీతంగా నష్టపోవడం, క్రాప్ హాలిడేకు దారి తీయడం విదితమే. మోహన్ కందా కమిటీ ప్రకారం కనీసం 25లక్షల టన్నుల వరకు గిడ్డంగుల కొరత ఉన్నది. దీనిలో కనీసం 10లక్షల టన్నుల మేరకు రాష్ట్రప్రభుత్వం స్టేట్ వేర్ హౌజింగ్ కార్పోరేషన్ ద్వారా సత్వరం నిర్మాణం చేపట్టాలి. దీని కొరకు 140 కోట్ల కేటాయింపు అవసరం. కేంద్ర పథకాలు, నాబార్డు సహకారం వీలయినంత మేరకు ఉపయోగించవచ్చు కాని, వీటి సత్వర ఏర్పాటుకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి.

f. మార్కెట్ యార్డులను ఆధునీకరణ చెయ్యడము, అవసరమయిన చోట గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చెయ్యడము, వంటి పనులకు రూ. 500 కోట్లు కేటాయించవలెను.

## 2. సుస్థిర వ్యవసాయానికి ప్రోత్సాహం, వర్షాధారిత వ్యవసాయానికి ప్రత్యేక సహకారం

ప్రభుత్వం అందించే సహకారం ఎక్కువ భాగం పర్యావరణ పరం గా విధ్వంసం సృష్టిస్తున్న రసాయనిక ఎరువులు, పురుగు మందులు, హైబ్రిడ్/జన్యు మార్పిడి పంటల విత్తనాలు, సంకర జాతి పశువుల వైపే వుంటోంది. వీటి వలన రైతులకి ఖర్చులు పెరగటం తో పాటు, మారుతున్న శీతోష్ణ స్థితిలో మార్పులతో నష్టాలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపధ్యం లో రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తం గా వున్న అనుభవాలు చూస్తే సుస్థిర వ్యవసాయ పద్ధతులు రైతులకు ప్రయోజనాకరిగా వుంటాయని తెలుస్తుంది.

a. భూసారం జాతీయ ఆస్తిగా గుర్తించి, దానిని పెంచటం కోసం ప్రభుత్వం సరైన ప్రోత్సాహకాలు అందించాలి.

b. గత కొద్ది సంవత్సరాలుగా ఎరువుల సంక్షోభం పెరుగుతోంది. గత సంవత్సర కాలం లో డి.ఎ.పి. ధర రెట్టింపు కు పైగా పెరిగింది. పైగా అంతర్జాతీయం గా ఇంధన ధరలు పెరగటం, ముడి సరుకుల కొరత పెరుగుతూ వుండటం తో సమస్య ముదురుతోంది. ప్రపంచం లోని ఫోస్ఫటిక్ వనరులు ఇంకో ఇరవై ముప్పై సంవత్సరాలలో అంతరించి పోతాయన్న నివిదికల నేపధ్యం లోను, ఎరువుల వినియోగం ఎక్కువవటం వలన భూములు పాడవటం, ఎరువుల ఉత్పాదకత తగ్గిపోతున్న పరిస్థితులలో వీటి వినియోగం తగ్గించే దిశగా, భూముల సారం పెంచుకోవటం కోసం సేంద్రియ పదార్థాల వినియోగం పెంచేదిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. దీని కోసం ప్రత్యేక మైన ఒక సమగ్ర కార్యక్రమం అమలు చేయాలి. రాష్ట్ర స్థాయిలో వచ్చే ఇదు సంవత్సరాల కాలం లో రసాయనిక ఎరువుల వినియోగం కనీసం 50 శాతం తగ్గే విధంగా పధకాలు రూపొందించాలి.

c. వర్షాధార వ్యవసాయానికి సహాయం చేయటం కోసం ప్రభుత్వం 'వర్షాధార ప్రాంత్ర అథారిటీ ఏర్పాటు చేయటం జరిగింది. అయితే ఈ అథారిటి కేవలం మేఘమధనం మీద ఖర్చు పెట్టటం కాకుండా వర్షాధార ప్రాంతాల సమస్యలు తీర్చటం కోసం ఏమి ప్రయత్నాలు చేయలేదు. వర్షాధారం గా పండే పంటలైన చిరు ధాన్యాలు, నూనె గింజలు, పప్పు ధాన్యాల విస్తీర్ణం రోజు రోజు కి తగ్గి పోతోంది. వర్షాధార ప్రాంతాలలో ఒక సమగ్ర వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమం ప్రారంభించాలి. ఈ పంటలకి కూడా స్వామినాథన్ కమిషన్ సిఫారుసుల మేరకు మద్దతు ధరలు ప్రకటించటం తో పాటు, ప్రభుత్వమే సేకరణ జరపాలి.

d. వర్షాధార ప్రాంతాలలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి ఆ ప్రాంతానికి అనుకూలమైన పంటలు, పంటలలో భిన్నత్వము, ప్రతి రైతుకి కనీసం ఒకటి లేదా రెండు ఎకరాలకు పంటను రక్షించేందుకు సరిపోయే సాగునీరు లభించే ఏర్పాటు, పశుసంపద పెంపొందించడం, కరువు పరిస్థితులను ముందే గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం – ఇవన్నీ ముఖ్యం. ఈ పద్ధతిలో ఒక పటిష్టమైన కార్యక్రమాన్ని రూపొందించి 100 మండలాలలో ఈ సంవత్సరం నుండి

అమలు చేయాలి. దీనికి మండలానికి 2 కోట్లు చొప్పున 200 కోట్లు కేటాయించాలి. మొత్తం వర్షాధారిత ప్రాంతాల సమగ్ర కార్యక్రమానికి 500 కోట్ల కేటాయింపు అవసరము.

e. గ్రామీణ ప్రాంతాలలో పశువుల సంఖ్య తగ్గి పోవటం తో వ్యవసాయం, భూసారం తగ్గటం తో పాటు రైతులకు ముఖ్యం గా మహిళా రైతులకు ఆదాయ వనరులు తగ్గుతున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా పశుక్రాంతి పధకం ద్వారా 'సంకర జాతి' పశువులను మాత్రమే ప్రోత్సహిస్తున్నారు. మన ప్రాంతాలకి ముఖ్యం గా మెట్ట ప్రాంతాలకి అనువుగా కాక పోవటంతో కష్టాలు నష్టాలు ఎక్కువవుతున్నాయి. ప్రభుత్వం వీటి పైనే కాక రైతుల అవసరాల మేరకు 'దేశీయ' పశువులకి సహాయం అందించాలి.

f. స్థానిక పరిస్థితులకు అనువైన పంటలు, పశువులను, స్థానిక వనరుల పై ఆధారపడి చేసే వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలి. ఇందుకోసం మండల స్థాయిలో పంటల ప్రణాళికలు రూపొందించి వీటి పై రైతులకు అవగాహనా కల్పించటానికి, నైపుణ్యం పెంచటానికి సహకారం అందించాలి.

## 3. <u>ఉత్పత్తి దారుల సంఘాలు</u>

రైతులు అసంఘటితంగా ఉండి, ఎవరి పద్ధతులలో వారు నిర్ణయాలు తీసుకొని, వ్యవసాయం చేసుకోవడం వలన తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. పంటల ఉత్పత్తి ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. సంస్థాగత సహాయం కూడా వారికి సరిగా అందడంలేదు. తమ ఉత్పత్తులను, కూడా గిట్టుబాటు ధరలకు అమ్ముకోలేక వ్యాపారుల దోపిడీకి గురవుతున్నారు. సహజ వనరులు అందరికీ అందుబాటులో లేక పంట నష్టాలను పొందుతున్నారు. ఎవరికీ వారు బోరు బావులు తవ్వుకుంటూ పోవడం వలన ఆర్థికంగా అప్పుల పాలవుతున్నారు. ఇటువంటి కారణాలను చూపి కొంత మంది చిన్న రైతుల, చిన్న కమతాల వ్యవసాయం గిట్టుబాటు కాదని ప్రచారం చేస్తున్నారు. సాగు భూములను కాంట్రాక్ట్ కార్పోరేట్ వ్యవసాయానికి అప్పగించి, చిన్న, సన్నకారు రైతులు వేరే ఉపాది అవకాశాలను చూసుకోవాలని బోధిస్తున్నారు. ఈ ప్రతిపాదన అత్మహత్యా సదృశ్యమైనది. సంఘటిత రంగంలో, పారిశ్రామిక, సేవా రంగాలలో, ఉపాధి అవకాశాలకు పరిమితులు వున్నాయి. మెరుగైన ఉపాధి అవకాశాలకు గ్యారంటీ చూపకుండా గ్రామీణ పేద రైతులను, భూముల నుండి బేధకలు చేయడం వారిని ఆకలి చావుల వైపు, అనారోగ్య పీడిత జీవితం వైపు నెట్టడమే.

a. అందుకే, గ్రామీణ చిన్న, సన్నకారు రైతుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా వారికి ఆదాయ భద్రత కల్పించేందుకు వారిని సంఘటితం చేసి, ఉత్పత్తి దారుల సంఘాలుగా ఏర్పరచాలి.

b. ప్రతి 2500 ఎకరాలకు, ఒక ఉత్పత్తి దారుల సంఘాన్ని ఏర్పరచాలి.

c. ఈ సంఘం కింద రైతులను కమతాల సైజును బట్టి, పంటల సాగును బట్టి, చిన్న చిన్న బృందాలుగా, నిర్మాణం చేయాలి.

d. ఈ సంఘం, తన పరిధిలో సాగు చేయాల్సిన పంటలను, (భూమి స్వభావాన్ని బట్టి, వనరుల అందుబాటును బట్టి) నిర్ణయించుకుంటుంది.

e. ఈ సంఘం, తన పరిధిలో వుండే రైతులకు అవసరమైన రుణాలను, ఇతర పథకాలను, వ్యవసాయానికి అవసరమైన ఇతర ఉపకరణాలను, సమీకరించి అందిస్తుంది.

f. చిన్న, సన్నకారు రైతులకు, చిన్న కమతాలకు ఉపయోగపడే యంత్రాలను, రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ సంఘానికి సబ్సిడి మీద ఋణం గానో, ఉచితంగానో అందిచాలి.

g. ఈ సంఘం, తన కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు, అవసరమైన సిబ్బందిని నియమించుకునేందుకు రెండు సంవత్సరాల పాటు, ప్రభుత్వం నిధులను కేటాయించాలి. కనీస వసతులను, ఇతర సరంజామాను సమకూర్చుకునేందుకు నిధులు కేటాయించాలి.

h. ఈ సంఘం పరిధితో పంటల స్వభావాన్ని బట్టి, ప్రాసెసింగ్ యూనిట్లను, ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం నిధులను ఇవ్వాలి.

i. ఈ సంఘం, తన పరిధిలో ఉన్న నీటి వనరులతో అన్ని భూములకు నీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ప్రణాలికను రూపొందించుకుంటుంది. నీటి పంపిణీకి అవసరమైన విద్యుత్ ను, పైప్ లైన్లను, ఉచితంగానో (విద్యుత్), సబ్సిడీమీదో, ప్రభుత్వం అందించాలి.

j. ఈ సంఘం పరిధిలో అవసరమైన పంటల నిల్వ గోదాములను, అవసరమైన చోట శీతల గిడ్డంగులను నిర్మించుకునేదుకు ప్రభుత్వం, నిధులు కేటాయించాలి.

k. రాష్ట్ర వ్యాపితంగా రెండు కోట్ల యాభై లక్షల ఎకరాల సాగు భూముల పరిధిలో, మొత్తం పదివేల ఉత్పత్తిదారుల సంఘాల నిర్మాణం అవసరముంటుంది. తొలి దశలో 2012-13 బడ్జెట్లో వెయ్యి ఉత్పత్తి దారుల సంఘులా నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి. క్రమంగా రాబోయే మూడు సంవత్సరాలలో రాష్ట్ర వ్యాపితంగా ఈ సంఘాల నిర్మాణం పూర్తి చేయాలి.

**ఒక ఉత్పత్తి దారుల సంఘానికి మొదటి సంవత్సరంలో కావలసిన ప్రభుత్వ సహకారం:**

| | | |
|---|---|---|
| (i) | పంట నిలువ గోదాములు (సగటున 2000టన్నుల కెపాసిటీ): | ౩౦.౦ లక్షలు |
| (ii) | సిబ్బంది (ఒక వ్యవసాయ నిపుణుడు, కార్యదర్శి, అకౌంటెంట్, మార్కెటింగ్ అసిస్టెంట్, ఇతర అసిస్టెంట్): | 6.3 లక్షలు |
| (iii) | రైతు సేవా కేంద్రం (మధ్యతరగతి యంత్రాలతో): | 25.0 లక్షలు |
| (iv) | ప్రాసెసింగ్ యూనిట్లు: | 20.0 లక్షలు |
| (v) | ట్రైనింగ్ కార్యక్రమాలు: | 2.0 లక్షలు |
| (vi) | నిర్వాహక ఖర్చులు: | 2.7 లక్షలు |
| | **మొత్తం ఖర్చు:** | **86.0 లక్షలు** |

మొత్తం 1000 ఉత్పత్తిదారుల సంఘాలకు కలిపి 860కోట్ల నిధులు కేటాయించాలి.

## 4. వ్యవసాయ పరిశోధన మరియు విస్తరణ ను పటిష్టం చేయడం

a. ప్రస్తుతం విస్తరణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయింది. దీనితో రైతులు సలహాల కోసం డీలర్ల పైనే ఆధార పడుతున్నారు. ప్రతి 1000 హెక్టార్లకు కనీసం ఒక AEO స్థాయి విస్తరణ అధికారిని నియమించాలి. అంటే రాష్ట్రం మొత్తం మీద 10,000 AEOలు ఉండాలి.

b. వ్యవసాయ పరిశోధనలకు నిధుల లేమితో పరిశోధనలు కుంటు పడుతున్నాయి. పరిశోధన లకు నదులు రెట్టింపు చేయాలి.

c. పరిశోధన నిధులలో కనీసం 50 శాతం సేంద్రియ సుస్థిర వ్యవసాయ పద్ధతుల పై ఖర్చు పెట్టాలి

d. విస్తరణ, పరిశోధనలను సామజిక తనిఖీ ల కిందకు తేవాలి. దీనికోసం జిల్లా స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలోను కమిటీలు ఏర్పాటు చేయాలి.

e. రాష్ట్ర స్తాయిలో వ్యవసాయ రంగానికి సంబంధించిన వివిధ శాఖల మధ్య సమన్వయము కోసం ఒక వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

**f.** ప్రతి సంవత్సరం రైతుల ఆర్ధిక స్థితి పై, జీవన గతి పై ప్రత్యేక నివేదిక ప్రభుత్వం ప్రవేశ పెట్టాలి.

## 5. సరైన విత్తనాలు విత్తనాలు అందుబాటులో-ధరలు, నాణ్యత పై నియంత్రణ

వ్యవసాయం లో ముఖ్య వనరైన విత్తనాల పై నియంత్రణ కరువవటం తో రైతులు విపరీతంగా నష్ట పోతున్నారు. ఆంధ్ర ప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ పూర్తీ గా నిర్వీర్యం ఐంది. అలాగే వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన పంట రకాలు, హైబ్రిడ్లు రైతులకు అందటం లేదు. పత్తి, మొక్క జొన్న లాంటి పంటలలో ఈ సమస్య మరింత తీవ్రం గా వుంది. అలాగే విత్తన నాణ్యత విషయం లోను, ధరల విషయం లోను నియంత్రణ లేకపోవటం వలన కంపెనీలు ఇష్టం వచ్చినట్టు ధరలు పెంచుకుంటున్నారు. నాణ్యత లేని విత్తనాలతో రైతులు మోసపోతున్నారు.

a. వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన వంగాడాలన్ని రైతులకి అందుబాటులోకి తీసుకు రావాలి. దీనికి విత్తనాభి వృద్ది సంస్థ కి బాధ్యత ఇవ్వాలి. దీనికి అవసర మైన బ్రీదర్ విత్తనాలు అభివృద్ధి చేసి ఇచ్చే భాద్యత వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఇవ్వాలి. ఇందుకు సరైన నిధులు కేటాయించాలి.

b. రైతులు తమ కోసం, రైతు సహకార సంఘాలు తమ సభ్యుల కోసం విత్తనాలు వృద్ధి చేసి వాడుకోవటం కోసం గ్రామ స్థాయి లో వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. విత్తన సబ్సిడీ లను వీరికి కూడా వర్తింప చేయాలి.

c. రాష్ట్ర స్తాయిలో విత్తన కమిటి ఏర్పాటు చేసి ప్రభుత్వం విడుదల చేసిన విత్తనాల తో పాటు ప్రైవేటు సంస్థలు అమ్ముతున్న truth full లేబుల్ విత్తనాలను కూడా రిజిస్టర్ చేసుకోవాలి. వీటి performance పరిక్షలు చేసి నివేదికలు అందరికి అందుబాటు లో వుంచాలి.

d. విత్తనాల ప్రకటన ల పై నియంత్రణ విధించాలి. ప్రకటన లలో పేర్కొన్న అంశాలకు కంపెనీలను భాద్యుల్ని చేయాలి.

e. విత్తన నాణ్యత పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కమీటి లు వుండాలి. విత్తనం వలన పంట నష్టం అనే ఫిర్యాదులు అందితే పంటకాలం ఐపోయే లోపు పరిష్కరించాలి. రాష్ట్ర విత్తన కమీటి performance నివేదిక కు అనుగుణంగా నష్ట పరిహారం అందించాలి.

f. విత్తనాలు బాగాలేనప్పుడు ప్రస్తుతం వున్న రైతులకందించే నష్ట పరిహారం చాల తక్కువగా వుంది. దీనిని ఎకరానికి కనీసం 25 వేల రూపాయలుగా మార్చాలి. నష్ట పరిహారం నిర్ణయించే విషయం లో పెట్టుబడి ఖర్చును, పంట దశను పరిగణ లోకి తీసుకోవాలి.

g. నాణ్యత లేని విత్తనాలను అమ్మే కంపెని ల పై విధించే జరిమానా కూడా చాలా తక్కువగా వుంది. దీనిని విత్తనాల ధరలని బట్టి, నష్టం జరిగిన స్థాయి ని బట్టి పెంచాలి. అలాగే ప్రభుత్వ విత్తన సంస్థలని కూడా ఈ పరిధిలోకి తేవాలి.

## 6. <u>రుణాలు</u>

రాష్ట్రంలో వ్యవసాయం చేస్తున్న వాస్తవ సాగుదారులందరికీ సంస్థాగత రుణ సౌకర్యం అందడం లేదు. రాష్ట్రం లో వ్యవసాయ రుణ అవసరాలలో కేవలం 27 శాతం మాత్రమే సంస్థాగత రుణాలు. అలాగే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ తక్కువవటం తో (ఉదా. వరి పండించటానికి సుమారు 26 వేలు ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి, అయితే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట ఋణం ఎక్కువలో ఎక్కువ 17 వేలు మాత్రమే) అందిన కొద్ది మొత్తాలు కూడా పంటల ఉత్పత్తి ఖర్చులకు సరిపోవడం లేదు. రాష్ట్రం లో రాను రాను కౌలు రైతుల సంఖ్య పెరుగుతోంది. ఒక కోటి ఇరవై లక్షల రైతు కుటుంబాలలో ఇరవై లక్షల కుటుంబాలు కులు రైతులవే. వీరికి సంస్థాగత రుణాలు అందటం లేదు. వీరికి గుర్తింపు కార్డులు ఇస్తామని ప్రకటించి దానికోసం చట్టం చేసినా కేవలం ఇదు లక్షల మందికే కార్డులు అందాయి. వారిలో ఈ సంవత్సరం కేవలం 75 వేల మందికి మాత్రమే రుణాలు అందాయి. వీటన్నిటి వలన రైతులు తిరిగి ప్రైవేటు రుణాలపై (ఎక్కువ వడ్డీలతో) ఆధారపడవలసి వస్తున్నది.

a. బ్యాంకులు పంట రుణాలను పూర్తిగా వాస్తవ సాగుదారులకే యివ్వాలి.అది కూడా పంటల సీజన్ ప్రారంభం కాకముందే రుణాలు అందాలి.

b. వివిధ పంటలకు వాస్తవ ఉత్పత్తి ఖర్చుల ఆధారంగా బ్యాంకులు స్కేల్ అఫ్ ఫైనాన్సు నిర్ణయించి రుణాలను ఇవ్వాలి. ఈ విషయంలో ఉత్పత్తి ఖర్చుల విషయంలో ప్రాంతాల పరంగా ఉన్న వ్యత్యాసాలను కూడా పరిగణనలో పెట్టుకోవాలి.

c. రైతులందరికీ వడ్డీ లేకుండా లక్ష రూపాయల వరకూ రుణాలు ఇస్తామనే ప్రభుత్వ వాగ్దానాలను నిలబెట్టుకోవాలి..భూమి యజమానులకు కాకుండా వాస్తవ సాగుదారులకు ఈ రుణాలు అందాలి.

d. కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు నిరాకరిస్తున్నాయి. రుణాల వసూలుకు హామీ అడుగుతున్నాయి.ఈ విషయంలో ప్రభుత్వం హామీ ఇవ్వకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేయవు.కాబట్టి ప్రభుత్వం కౌలు రైతుల రుణాలకు హామీగా counter guarantee ఇవ్వటానికి బడ్జెట్ లో కేటాయింపులు చేయాలి.

e. పావలా వడ్డీ పథకం అరకొరగా మాత్రమే అమలవుతున్నది.రైతులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో తీరిస్తే మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.అది కూడా రైతులు ఋణం తీర్చిన చాలా కాలానికి (ఒక్కోసారి సంవత్సరాలు గడిచాక ) ప్రభుత్వం వడ్డీ రాయితీని రైతు అకౌంటులో జమ చేస్తుంది. దీని వల్ల వివిధ కారణాల వలన రుణాలు తీర్చలేని సన్న,చిన్నకారు రైతులకు (ముఖ్యంగా వాస్తవ సాగుదారులకు)ఈ పథకం ఏ మాత్రం ఉపయోగపడడం లేదు.అందువల్ల కాల పరిమితి లేకుండా పావలా వడ్డీ పథకాన్ని సాగుదారులందరికీ వర్తింప చేయాలి. రాష్ట్ర వ్యాపితంగా వడ్డీ రాయితీకి అవసరమైన మొత్తాన్ని ముందుగానే బడ్జెట్లో నిధులు కేటాయించాలి.ఆ మొత్తాలను బ్యాంకులలో ముందుగానే జమ చేయాలి.

## 7. పంటల బీమా

రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరదలు, కరువులు, భారీ వర్షాలు, తుపాన్లు పంటలను నాశనం చేస్తున్నాయి. దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతూ అప్పులలో కూరుకు పోతున్నారు. అప్పులు తీర్చలేమనే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత రెండు సంవత్సరాలనుండి ప్రకృతి వైపరీత్యాల వలన మన రాష్ట్ర రైతులు వేల కోట్ల రూపాయల పంటలను నష్టపోయారు. ప్రభుత్వాలనుండి వారికి అందిన సహాయం చాలా చాలా తక్కువ, లేదా శూన్యం. అది కూడా సకాలంలో అందడం లేదు. ఈ స్థితిలో సమగ్రమయిన పంటల బీమా పథకం మాత్రమే రైతులను ఆదుకుంటుంది. కానీ అమలులో ఉన్న బీమా పథకం రైతులకు ఏ మాత్రం ఉపయోగ పడడం లేదు. కొన్ని జిల్లాలలో, కొన్ని పంటలకు మాత్రమే గ్రామం యూనిట్ గా బీమా పథకం అమలవుతున్నది. వాతావరణ ఆధారిత బీమా పథకం కూడా అన్ని జిల్లాలలో, అన్ని పంటలకూ అమలు కావడం లేదు. చాలా సందర్భాలలో రైతులు ప్రీమియం ఎక్కువ కడుతున్నారు. వారికి పరిహారం తక్కువ అందుతున్నది. బ్యాంకుల నుండి రుణాలు పొందుతున్న రైతులకు మాత్రమే బీమా పథకం అందుబాటులో ఉంది. మిగిలిన వారికి ఈ పథకం చేరడం లేదు.

a. అన్ని జిల్లాలలో,అన్ని పంటలకు,అందరు రైతులకు సర్వే నంబరు ప్రాతిపదికగా బీమా పథకం అమలు కావాలి.ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం బీమా పథకాన్ని రూపొందించాలి.

b. **మైక్రో ఇన్సురెన్సు**: బీమాను నలుగు దశలలో అమలు చేయడానికి తగిన ప్రణాళికను రూపొందించాలి. (విత్తిన 30 రోజులలోపు, పంట సస్య రక్షణ దశలో పంట చివరి దశలో, పంట కోతల అనంతరం) ఆయా దశలకు గాను కనీస ప్రీమియంను, నిర్ణయించాలి. స్థానికంగా ఉండే మహిళా స్వయం సహాయక బృందాలను లేదా స్థానికంగా ఉండే సహకార సంఘాలను ఉపయోగించుకుని రైతుల (వాస్తవ సాగుదారుల) పేర్లను, సాగుచేసిన పంటలను, పంటల విస్తీర్ణాన్ని నమోదు చేయాలి. ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలి (ముఖ్యంగా సన్న, చిన్న కారు రైతులకు, కౌలు రైతులకు) మధ్య తరగతి, పెద్దరైతులు సాగుచేసిన పంటలకు గాను, ప్రీమియం మొత్తంలో సగభాగాన్ని రైతుల నుండి వసూలు చేయాలి. మిగిలిన సగభాగాన్ని ప్రభుత్వాలు భరించాలి. వాణిజ్య పంటలకు, ఉద్యాన పంటలకు కూడా ప్రస్తుత ప్రీమియం రేట్లను

తగ్గించాలి. రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమయ్యే ప్రీమియం మొత్తానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలి. బీమాను నిర్ణయించడానికి అవసరమైన పంట కోట నమూనా కమతాలను పారదర్శకంగా శాస్త్రీయంగా నిర్ణయించాలి. రైతుల సమక్షంలో ఈ కోతలు జరగాలి.

8. **<u>ప్రకృతి వైపరీత్యాల నష్ట పరిహారం (ఇన్ పుట్ సబ్సిడీగా యిస్తున్నది)</u>**

ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులకు జరుగుతున్న పంట నష్టాన్ని అంచనా వేయడంలో విపరీతమైన ఆలస్యం జరుగుతున్నది. రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు నష్టం అంచనాలను రూపొందించడానికి నెలలు గడుస్తున్నాయి. రూపొందించిన నివేదికను కేంద్రానికి పంపితే, అక్కడి నుండి కేంద్ర బృందం వచ్చి పరిశీలించి నివేదికను రూపొందిచేందుకు మరికొన్ని నెలలు గడుస్తున్నది. ఈ లోపు నష్టపోయిన రైతులకు ఏ పరిహారమూ అందడం లేదు. కేవలం కేంద్రం అందచేసే సహాయం కోసం ఎదురు చూడడం తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇందుకోసం ఖర్చు చేయడం లేదు. ఈ వైఖరి రైతులను మరింత కుంగదీస్తున్నది. మరింతగా అప్పుల పాలు చేస్తున్నది.

a. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టాలను వీలైనంత తగ్గించడానికి ముందస్తు జాగ్రత్తలు తగినన్ని తీసుకోవాలి. వర్షాధార ప్రాంతాలలో వర్షాభావం, కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అక్కడి పంటల ప్రణాళికను రూపొందించి అమలు చేయాలి. రైతుల విచక్షణకు వదిలేసి ప్రభుత్వం నిష్క్రియగా, నిర్లక్ష్యంగా, నిరాసక్తంగా వుండడం నేరపూరితమైంది. 2011-12 ఖరీఫ్ కరువు ఈ విషయాన్ని రుజువు చేసింది. అదేవిధంగా తుపాను పీడిత ప్రాంతాలలో పంట సీజన్ ను, వాతావరణ మార్పులను దృష్టిలో వుంచుకొని రూపొందించాలి. ఆయా ప్రాంతాలలో మురుగు కాలువల మరమ్మత్తు వెంటనే పూర్తి చేయాలి. ధాన్యాన్ని దాచుకునేందుకు, ఆరబెట్టుకునేందుకు తగిన స్థలాలను ఏర్పాటు చేయాలి. తక్షణమే పంటలను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
b. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం సంభవించినప్పుడు, వెంటనే రైతులను అద్దుకునేందుకు అవసరమైన నిధిని, రాష్ట్ర బడ్జెట్ లో కేటాయించాలి.
c. పంట పూర్తిగా నష్ట పోయినప్పుడు ఎకరానికి పదివేల రూపాయల పరిహారం అందించాలని హుడా కమిటీ సూచించింది. మన రాష్ట్రం లో ప్రస్తుతం చెల్లిస్తున్న పరిహారం ఎకరానికి 2400 రూపాయలు మాత్రమే. ఈ మొత్తాన్ని వెంటనే చెల్లించేందుకు కూడా ప్రభుత్వం బడ్జెట్ లో నిధులు కేటాయించడం లేదు. 2011 ఖరీఫ్ లో 85 లక్షల ఎకరాలలో పంటలు ఎండిపోయాయి. 17,000 కోట్లకు పైగా నష్టం రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 3,744 కోట్ల రూపాయల సహాయం చేయాలని కేంద్రాన్ని కోరింది. ఇంతవరకు కేంద్ర బృందం రాష్ట్రానికి రాలేదు. కేంద్ర సహాయం ఎప్పటికి వస్తుందో తెలియదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంత వరకు, ఒక్క రూపాయి కూడా రైతులకు అందించలేదు. ఈ పద్ధతి మారాలి.

## 9. <u>కౌలు రైతులకు సహకారం</u>

**a.** మన రాష్ట్రంలో వ్యవసాయదారులలో అత్యంత దుస్థితిలో ఉన్న వర్గం కౌలు రైతులదే. ఆత్మహత్యల్లో కూడా అత్యధికులు కౌలు రైతులే. కౌలు రేట్లు పెరిగిపోతూ, రుణాలు, బీమా, నష్టపరిహారాలు లభించక చితికిపోతున్న కౌలు రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

**b.** కౌలు రైతు గుర్తింపు కార్డులు అధికారిక అంకాల ప్రకారమే కేవలం 20శాతానికే లభించాయి. వచ్చే రెండు సంవత్సరాలలో 100శాతం కౌలు రైతులకు ఇవ్వాలి.

**c.** 25లక్షల కౌలు రైతులలో కేవలం 70వేల మందికే రుణాలు లభించాయి. దీని సంబంధిత సమస్యలను పరిష్కరించి, ఈ సంవత్సరం రుణాలు మరింత విస్తృతంగా లభింపజేయాలి. భూయాజమాన్యం లేని వారికి రుణాలివ్వడంలో బేంకులకు ఉన్న అభ్యంతరాలను తొలగించాలి. అవసరమైన మేరకు కౌలు రైతుల రుణాలకు పూచీకత్తుగా ఉండే నిధిని ఏర్పాటు చేయాలి. దీని కోసం రూ.1000 కోట్లు కేటాయించాలి.

**d.** పంటల బీమా కౌలు రైతులకు రుణాలతో నిమిత్తం లేకుండా లభించాలి. అదే విధంగా పంటల నష్ట పరిహారం కౌలు రైతులకు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

## 10. <u>వ్యవసాయదారుల సంక్షేమం, సామాజిక భద్రత, రైతు ఆత్మహత్య కుటుంబాల సహాయం</u>

a. రైతు ఆత్మహత్యలను సత్వరమే గుర్తించి నెల రోజులలోగా నిర్ధారణ పూర్తి చేసే నిబంధన తేవాలి. ఈ విషయంలో రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ సమన్వయంతో బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలి. జి.ఓ. 42/2004 ను అమలు చేసే నిబంధనలను సవరించి గ్రామ సభ ద్వారా ఆత్మహత్య కారణము, అప్పుల విషయము సత్వరంగా నిర్ధారణ జరిపే ప్రక్రియను ఏర్పాటు చెయ్యాలి.

b. వ్యవసాయదారుల సంక్షేమ నిధిగా రూ. 100 కోట్లు ఏర్పాటు చేసి ఆత్మహత్యలు, విద్యుత్తు షాక్ వలన మరణాలు, ఇతర ఆపత్కర పరిస్థితులలో కుటుంబాలకు సత్వర సహాయం అందజేయడానికి ఉపయోగించాలి.

c. వ్యవసాయాధారిత కుటుంబాలలో 55 సంవత్సరాల పై వయస్కులకు నెలకు రూ.1000 పింఛను ఇవ్వాలి.

d. విచ్చలవిడిగా పెరిగిపోతున్న వైద్య, విద్యా సేవల ఖర్చులు రైతు కుటుంబాలకు పెద్ద భారంగా మారాయి. సామాజిక భద్రతలో భాగంగా గ్రామీణ కుటుంబాలన్నింటికీ ఉచిత వైద్య, విద్యా సేవలనందించే వ్యవస్థ ఏర్పాటు చెయ్యాలి.